# మరవిప్పిన మర్మం

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటల వేళ.

నగరంలో నడిబొడ్డు ప్రాంతం.


ట్రాఫిక్ రద్దీతో జనం కిటకిటతో రోడ్డు కీకారణ్యంలా ఉంది. యూనిఫాంలో ఉన్న ఎస్.ఐ రంగనాథ్ రాజ్‌దూత్‌మీద వేగంగా వెళ్తున్నాడు. అనుభవం ఉన్న పోలీస్ ఉద్యోగి అయినందువల్లనో ఏమో, ఆ ట్రాఫిక్‌ను అవలీలగా ఛేదించుకుంటూ, అభిమన్యుడు పద్మవ్యూహంలోకి వెళ్తున్నట్లుగా దూసుకుపోతున్నాడు. ఎస్.ఐని చూడగానే చౌరస్తాలో వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గట్టిగా విజిల్‌వేసి, ఆయన చూసేటట్లుగా శాల్యూట్‌చేశాడు.

అందుకు ప్రతిగా తలని వంచి మళ్ళీ పైకెత్తి ముందుకు సాగిపోయాడు ఎస్.ఐ సాధారణంగా పోలీస్ అధికారులకు తమ క్రిందివారు శాల్యూట్ చేస్తే ప్రతిస్పందించే అలవాటుండదు. అలా చేస్తే అది తమ హోదాకి తక్కువనుకుంటారు. అది గమనించనట్లే ప్రవర్తిస్తారు. అయితే ఎస్.ఐ రంగనాథ్ విషయం వేరు. పోలీసు సాంప్రదాయానికి విరుద్ధంగా ఆయన క్రిందివారిని కూడా ఆదరంగా, గౌరవంగా చూస్తాడు. ఉద్యోగంలో చేరిన కొద్ది కాలంలోనే నిజాయితీపరుడుగా, నీతికి ప్రతీకగా పేరుగాంచాడు. దొంగలకు సంఘ విద్రోహ శక్తులకు సింహస్వప్నంగా మారాడు. దాంతో ప్రజలకు ఆయనపట్ల ఎనలేని గౌరవభావం ఏర్పడింది. అవసరానికి ఆదుకునే ఆపద్బాంధవుడిగా భావించసాగారు. అదే మిగతా అధికారులకు కంటగింపయింది. ఆయన మంచిపేరు తెచ్చుకోడం, ఘరానా దొంగలను, స్మగ్లర్లను కూడా పట్టేస్తుండడంతో వారు అసూయతో ఉడికిపోయారు.

ఎవరేమనుకున్నా అంకిత భావంతో తన విధిని నిర్వర్తించుకోసాగాడు ఆయన. మోటార్ సైకిల్ మలుపు తిరిగింది. ఆ దగ్గర్లోనే సినిమాహాల్ ఉంది. ఆరోజున ఏదో కొత్త సినిమా విడుదలయినట్లుంది. జనం టిక్కెట్లకోసం కిటకిటలాడుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో వేగం తగ్గించాడు రంగనాథ్.

ఇంతలో ఎదురుగుండా రాంగ్ డైరెక్షన్‌లో ఒక అంబాసిడార్ కారు వచ్చి ఇంచుమించు మోటార్ సైకిల్‌ను గుద్దుకోబోయింది. సడన్ బ్రేక్ వేసి రాజ్‌దూత్‌ని ఆపి క్రిందికి దిగాడురంగనాథ్.

అంబాసిడర్ కూడా ఆగింది.



తలుపులు తీసి డ్రైవర్‌తో సహా నలుగురు క్రిందికి దిగారు.

డ్రైవర్ వంక చూస్తూ "ఏయ్. రాంగ్ డైరెక్షన్‌లో వచ్చావు. నీకు డ్రైవింగ్ లైసెన్సు ఉందా?" అంటూ గద్దించి అడిగాడు రంగనాథ్.

"మాకు లేని లైసెన్సు లేదురా. రైట్ డైరెక్షన్‌లో నిన్ను పైకి పంపించే లైసెన్సు కూడా ఉంది" అన్నాడు వారిలో ఒకడు.

తలెత్తి అటు చూశాడు రంగనాథ్.

ఆ మాటలన్నది ఎవరోకాదు పేరుమోసిన స్మగ్లర్ అబ్దుల్లా. అతనంటే పోలీసులతో సహా అందరికీ సింహస్వప్నమే. బడా రాజకీయవేత్తలకు ఉన్నత పోలీస్ అధికారులకూ అతను ఆప్తమిత్రుడు. తాను కోట్లు సంపాదిస్తూ వాళ్ళకి వేలు విదిలిస్తుంటాడు. అందుకే అతని నీడని తాకడానికి కూడా క్రింది పోలీసులు భయపడతారు. అయితే మూడు రోజులక్రితం అతను దొంగబంగారం చేరవేస్తున్నాడని తెలిసి రెడ్ హాండెడ్‌గా పట్టుకోడానికి వెళ్ళాడురంగనాథ్ సమయానికి ఎవరో సమాచారమందించడంతో తప్పించుకుపోయాడు అబ్దుల్లా. ఆ పగ మనసులో పెట్టుకుని ఇప్పుడు తనమీదకి వచ్చాడన్నమాట!

"అబ్దుల్లా....నువ్వా..." అన్నాడు రంగనాథ్.

"అవును సేనేరా. నన్నే పట్టుంకుందామనుకుంటున్నావురా! ఇక్కడే ఈ నడిరోడ్డుమీద వందలమంది

చూస్తుండగా నిన్ను నిలువునా కాల్చేస్తాను. ఎవరడ్డొస్తారో చూస్తాను" అంటూ పిస్టల్ తీసాడు అబ్దుల్లా.

ఈ గలాభాకి జనం బోలెడుమంది చేరారు. ఏదో యాక్సిడెంట్ అయిందనుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్ అటు పరుగెత్తుకు వచ్చాడు. ఆ సమయానికి అదే దారినపోతున్న మరో ఇద్దరు పోలీసు ఆఫీసర్‌లు కూడా జీపు ఆపి అటు వచ్చారు.

వాళ్ళందర్నీ చూస్తూ "ఒరేయ్. ఇంతమంది జనమే కాదురా. పోలీస్ ఆఫీసర్లముందే నీ ప్రాణాలు తీస్తారా" అంటూ వరుసగా నాలుగుసార్లు పిస్టల్ పేల్చాడు.

మారు మాటలేకుండా కుప్పకూలిపోయాడు రంగనాథ్. నిమిషాల్లో అక్కడ రక్తపు మడుగు ఏర్పడింది.

ఎప్పుడైతే పిస్టల్ శబ్దం వినిపించిందో జనం అంతా ఎక్కడివాళ్ళక్కడ పుంజాలు తెంపుకుని పారిపోయారు. క్షణాల్లో నిర్మానుష్యం అయిన ఆ రోడ్డుమీద అబ్దుల్లా, అతని అనుచరుల కారు నిరాటంకంగా వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోయాక తిరిగి జనం అక్కడికి బిలబిలలాడుతూ చేరుకోసాగారు. ఆ దారుణాన్ని కళ్ళతో చూసికూడా, ట్రాఫిక్ కానిస్టేబుల్ మిగిలిన ఇద్దరు పోలీసు అధికారులూ అప్పుడే అక్కడికి వచ్చినట్టు నటిస్తూ "ఏమైంది! ఏమైంది? తప్పుకోండి" అంటూ జనాన్ని అదిలించడం మొదలుపెట్టారు.

మరికొంత సేపట్లో వేరే ట్రాఫిక్ సిబ్బంది వచ్చి జనాన్ని, వాహనాల్ని మళ్ళించడం, పోలీసు అధికార్లు ఫొటోగ్రాఫర్‌లు వచ్చి ఫోటోలు తీసుకోవడం, అంబులెన్స్ వచ్చి రంగనాథ్ శవాన్ని హాస్పిటల్‌కి తీసుకుపోవడం వంటివి జరిగాయి.

కోర్టులో రంగనాథ్ హత్యకేసు విచారణ జరుగుతోంది. ముగ్గురు పోలీసు ఉద్యోగస్థులతో సహా కొన్ని వందలమంది అబ్దుల్లా రంగనాథ్‌ని పిస్టల్‌తో కాల్చి చంపడాన్ని ప్రత్యక్షంగా చూశారు. కాని ఏ ఒక్కరు కూడా ఆ విషయాన్ని సాక్ష్యంగా చెప్పడానికి ముందుకు రాలేదు. ప్రతివారు కూడా హత్య జరిగిన సమయంలో అబ్దుల్లాని అక్కడ చూశామన్నవారుకాని, అతను కాలుస్తుండగా చూసినట్లుకాని ఎవరూ చెప్పలేదు. కనీసం అతనిచేతిలో పిస్టల్‌ని చూసినట్టుగా కూడా ఏ ఒక్కరూ చెప్పలేదు.

అబ్దుల్లాకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. చెప్తే ఆ వ్యక్తి కోరి మృత్యువుని తెచ్చుకున్నట్లే. పోలీసులకు కూడా చూసింది చెప్పడానికి ధైర్యం లేదు. రంగనాథ్ వంటి పోలీస్ అధికారినే కాల్చి చంపినవానికి తమ ప్రాణాలు తీయడం ఒక లెక్కా పైగా అవసరమనిపించిన చోట డబ్బు గుప్పించేశాడు అబ్దుల్లా. ఫలితంగా అతనికి వ్యతిరేక సాక్ష్యమే లేకపోయింది.

ఆ రోజు ఆ కేసులో చివరి హియరింగ్,

అబ్దుల్లా బోనులో నిలబడి ఉన్నాడు.

"మిలార్డ్. ఈ కేసుకు సంబంధించిన సాక్షులందర్నీ విచారించడం పూర్తి అయింది. ఈ సాక్ష్యులవల్ల ముద్దాయి నేరం చేసినట్లు ఎంతమాత్రం రుజువుకాలేదు. కనుక నిర్దోషి అయిన నా క్లయింట్‌ను విడుదల చేయవలసిందిగా కోర్టువారికి విన్నవించుకుంటున్నాను" అంటూ ముగించాడు ముద్దాయి తరపు వకీలు ఆనందరావు.

కోర్టులో సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దం అలముకుంది.

ఇంక జడ్జిగారు తమ తీర్పున ప్రకటించడమో, లేదా తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడమో తరువాయి.

న్యాయమూర్తితో సహా కోర్టుకి వచ్చిన అశేష జనవాహిని అందరికీ తెలుసు అబ్దుల్లా హత్య చేశాడని. కాని తగిన సాక్ష్యం లేనందువల్ల కొట్టుకుపోతోంది కేసు. హంతకుడు నిర్దోషి అన్న ముద్రతో పెద్ద మనిషిలా బయటకు రాబోతున్నాడు. న్యాయం నడివీధిలో ఉరికంబం ఎక్కబోతోంది.

జరుగుతున్న అన్యాయానికి హృదయం దహించుకుపోతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాగర్‌కి. కళ్ళకి గంతలువుండే న్యాయదేవత విగ్రహం కళ్ళముందు మెదిలింది. అందుకే అంటారు న్యాయస్థానాలకి చెవులే కాని కళ్ళు లేవని. ఈ కేసు ఎలా తిరగతోడాలా, దోషిని ఎలా పట్టియ్యాలా అన్న ఆలోచనతో ఆయన మస్తిష్కం సతమతమవుతోంది. పక్కనుంచి ఎవరో వీపుమీద తట్టి నెమ్మదిగా "సార్" అని పిలవడంతో అటు తిరిగాడు సాగర్.

"సార్ నా పేరు అనిల్. నా వివరాలు తర్వాత చెపుతాను. ఈ కేసులో నేను కీలకమైన సాక్ష్యంతో దోషిని పట్టియ్యగలను. న్యాయమూర్తికి చెప్పి నాకా అవకాశం ఇప్పించండి" అన్నాడు ఆయన.

ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడిచేతికి తెప్పదొరికినట్లయింది సాగర్‌కి.

"మిలార్డ్. ఒక ముఖ్యమైన విన్నపం ఈయన అనిల్. ఈ కేసులో కీలక సాక్ష్యాన్ని అందజేయగలనంటున్నారు. అందుకు ఆయనకి అవకాశం ఇప్పించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నాడు సాగర్.

కోర్టులో అందరిమెడలూ అనిల్ వంక తిరిగాయి.

అబ్దుల్లా కూడా అతనివంక ఆశ్చర్యంగా చూడసాగాడు.

"సరే. సాక్షిని ప్రవేశపెట్టండి" అన్నాడు న్యాయమూర్తి.

అనిల్ బోనులోకి ప్రవేశించాడు ప్రమాణం చేయమంటుండగా.

"మిలార్డ్ ఒక చిన్న మనవి" అన్నాడు.

అసహనంగా చూశారు జడ్జిగారు.

"నేను స్వయంగా చెప్పే సాక్ష్యం ఏమీలేదు. అందువల్ల ప్రమాణం చేసే అవసరం లేదు."

"మరి" అన్నాడు న్యాయమూర్తి కనుబొమలు చిట్లిస్తూ.

చేతిలో వున్న మెడికల్ కిట్‌వంటి దానిని పైకి ఎత్తి చూపుతూ.

"మిలార్డ్ ఇది నేను రూపొందించిన యంత్రం. దీనిని ముద్దాయికి కనెక్ట్ చేస్తే అతని ఆలోచనలను రికార్డుచేసి మాటలుగా వినిపిస్తుంది. మనిషి అబద్ధం చెప్పినా మనసు నిజమే చెప్తుంది. కనుక, వాస్తవం బయట పడుతుంది" అన్నాడు అనిల్.

"నో...నో.. ఇటువంటి లై డిటెక్టర్ల సాక్ష్యాన్ని కోర్టు గుర్తించదు" అన్నాడు న్యాయమూర్తి.

"మిలార్డ్. ఇది లైడిటెక్టర్ కాదు అది అబద్దం చెప్తున్న మనిషి లోనయ్యే సంఘర్షణవల్ల ఏర్పడిన ఒత్తిడిని నమోదు చేసి అబద్ధం చెప్తున్నట్లు సూచిస్తుంది. నా యంత్రం అలాకాదు. మనిషి మస్తిష్కంలోని ఆలోచనలను యధాతధంగా రికార్డుచేసి మాటలుగా ప్రసారం చేస్తుంది."

"ఈ లక్ష్యాన్ని కన్‌క్లూజిన్ ప్రూఫ్‌గా తీసుకోకపోయినా, కోరాబోరేటివ్ ఎవిడెన్స్‌గా గుర్తించవచ్చని నా విన్నపం" అన్నాడు సాగర్.

"అలా అయినప్పటికీ కేవలం సంబంధిత వ్యక్తి అనుమతిస్తేనే దీనిని ఉపయోగించవచ్చు. అంతేకాని ముద్దాయిని కోర్టు బలవంతం చేయలేదు" అని పరిస్థితిని వివరించారు న్యాయమూర్తి.

"తమ అనుమతితో ముద్దాయిని అడుగుతాను" అని అబ్దుల్లా వంక తిరిగి "మిస్టర్ అబ్దుల్లా...ఈ యంత్రాన్ని నీమీద ప్రయోగించడానికి ఒప్పుకోవలసిందిగా కోరుతున్నాను" అన్నాడు సాగర్.

అబ్దుల్లా ముఖం కోపంతో అరుణవర్ణమయింది.

"నేనెందుకు ఒప్పుకోవాలి" అన్నాడు గర్జిస్తూ.

"అది నీ ఇష్టం. నిజంగా నీవు నేరం చేయకపోతే నీకు భయపడాల్సిన అవసరం లేదు" అన్నాడు సాగర్.

"నాకెందుకు భయం? అని ఒక్క నిమిషం ఆలోచనలోపడ్డాడు. అబ్దుల్లా" మహామహా సాక్ష్యాలే మట్టికొట్టుకుపోయాయి ఇంక ఈ యంత్రం బయటపెట్టేది ఏముంటుంది? ఇందుకు ఒప్పుకోకపోతే తప్పుచేశాను కనుకనే ఒప్పుకోలేదని నలుగురూ అనుకుంటారు. పరోక్షంగా నా నేరం రుజువవుతుంది. ఇందుకు ఒప్పుకుంటే నిర్దోషి కనుకనే నిర్భయంగా ఒప్పుకున్నాడని నలుగురూ అనుకుంటారు - బాగా ఆలోచించి "సరే. ఏం పరీక్షలు చేసుకుంటారో చేసుకోండి" అన్నాడు.

"మిస్టర్ అనిల్. యుకెన్ ప్రొసీడ్" అన్నాడు న్యాయమూర్తి.

"యస్ మిలార్డ్" అంటూ తన కిట్‌తో అబ్దుల్లా దగ్గరికి వచ్చాడు అనిల్

పైకి బింకం ప్రదర్శించినా గుండెలు గుభిల్లుమన్నాయి అబ్దుల్లాకి.

డాక్టర్ అనిల్ తన కిట్‌ను అబ్దుల్లా నిలబడ్డ బోనుపక్కన ఒక బల్లమీద ఉంచి తెరిచాడు. అందులోంచి ఒక గాజు తొట్టెను తీసి బల్లమీద పెట్టాడు. అందులో ఆకుపచ్చని ద్రవం ఒకటుంది. దానిలో రెండు మెటల్ రాడ్స్ ఉన్నాయి. వాటినుంచి పొడుగాటి వైర్లు ఉన్నాయి. వాటి చివర టెలిఫోన్ ఆపరేటర్లు పెట్టుకునే హెడ్‌గేర్‌లు వంటి రెండు రాగి డిప్పలు, ఒక వంపు కడ్డీతో కలపబడివున్నాయి. ఆ రాగి డిప్పలు రెండూ రెండు ఎలక్ట్రోడ్స్ అన్నమాట.

ఆ రెండు ఎలక్ట్రోడ్స్‌ను అబ్దుల్లా తలకు తగిలించాడు డాక్టర్ అనిల్.

గ్లాస్ కేస్‌లోంచి రెండు వైరులు మెట్‌రాడ్స్‌నుంచి బయటకు వచ్చి టేప్‌రికార్డర్ వంటి దానికి కలిపి ఉన్నాయి. స్విచ్‌మీద చేయివేసి సిద్ధంగా ఉంచి "మీరు ముద్దాయిని ప్రశ్నించండి" అన్నాడు సాగర్‌తో.

"మిస్టర్ అబ్దుల్లా. ఒకే ఒక్క ప్రశ్న అడుగుతాను. నిజం కప్పిపెట్టకుండా సమాధానం చెప్పండి. ఇన్‌స్పెక్టర్ రంగనాథ్‌ని మీరు హత్య చేశారా లేదా" అడిగాడుసాగర్.

ప్రశ్న పూర్తి అవగానే స్విచ్ ఆన్‌చేశాడు. అనిల్. టేప్ తిరుగుతున్న సన్నని శబ్దం వచ్చింది.

"మహామహావాళ్ళే నా దగ్గరికి రావడానికి భయపడేవారు. నా అనుగ్రహంకోసం పెద్ద పోటీలు పడేవారు అటువంటిది ఈ ఛోక్రా ఈ ఎస్.ఐ. రంగనాథ్ నన్ను పట్టుకోడానికి వచ్చి ప్లానంతా పాడుచేస్తాడా? అటువంటివాడిని గోటితోనే తుంచివేస్తాను. వదిలిపెట్తానా? అందుకే మళ్ళీ ఏ ఆఫీసరు ఇంతటి సాహసం చేయకుండా పట్టపగలు నడిరోడ్డున వందలమంది చూస్తుండగా కాల్చి చంపాను. అది చూసిన పోలీసులు మాత్రం సాక్ష్యం చెప్పగలిగారా" అబ్దుల్లా ఆలోచనలు పాదరసంలాగా సాగిపోతున్నాయి.

అబ్దుల్లా పెదవులు కదలనేలేదు. ఆ ఆలోచనలు మాత్రం మాటలుగా లోవాయిస్‌లో టేప్‌మీద రికార్డు అయిపోయాయి. అతను పెదివి విప్పేలోపునే స్విచ్‌ని ఆఫ్‌చేసి టేప్‌ని రివర్స్‌చేసి వాల్యూం పెంచి టేప్‌ని ప్లే చేశాడు అనిల్.

ఈసారి రికార్డయిన మాటలు కోర్టులో అందరికీ స్పష్టంగా వినిపించాయి.

"ఇప్పుడేమంటావు అబ్దుల్లా?" అంటూ గర్జించి అడిగాడు సాగర్. అప్పటిదాకా "మీరు" అని సంబోధించినవాడు ఇప్పుడు "నువ్వు" అనేశాడు.

ఇంకేమీ మాట్లాడలేక నేరాన్ని ఒప్పుకున్నడు అబ్దుల్లా.

అతని తలకున్న హెడ్‌గేర్స్‌ని తొలగించాడు అనిల్.

తీర్పును వాయిదా వేస్తూ కోర్టును చాలించాడు న్యాయమూర్తి.

అబ్దుల్లా చేతులకి బేడీలు వేసి తీసుకుపోయారు పోలీసులు.

అనిల్ ప్రక్కనుంచిపోతూ "బేటా అప్పుడే ఏమయింది! చూస్తావు నా తడాఖా" అంటూ కళ్ళతో నిప్పులు కక్కుతూ వెళ్ళాడు అబ్దుల్లా.

అనిల్ తన యంత్రాన్ని కిట్‌లోకి సర్దేశాడు. ఆయనా, సాగర్ బయటకు రాగానే పత్రికా విలేకరులు ఈగల్లా చుట్టుముట్టారు. ప్రశ్నల వర్షం కురిపించారు.

"చూడండి. ఇప్పుడు నేనేమి చెప్పలేను. నా పరిశోధన ఇంకా ప్రయోగదశలోనే ఉంది. దీని ఫలితాలను నేను ముందుగా సైంటిఫిక్ కౌన్సిల్‌కీ, ప్రభుత్వానికి తెలియచేయాలి. నేను సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ వారి అనుమతితోనే దీని వివరాలు బయట పెట్టగలను" అంటూ వినయంగా నచ్చచెప్పి బయటపడ్డాడు అనిల్.

"మిస్టర్ అనిల్ నా ఛాంబర్‌లోకి వెళ్దాం రండి" అన్నాడు సాగర్.

లోపల కూర్చున్నాక "మిస్టర్ అనిల్ మీది బందరుకదూ?" అన్నాడు.

"అవును. మీదీ బందరేనని నాకూ తెలుసు. కాకపోతే పరిచయం లేదు" అన్నాడు అనిల్.

"నిజమే. మనిద్దరిదీ ఒకే ఊరయినా, ఇప్పుడు ఒకే ఊళ్ళో ఉంటున్నా, ఇంతకాలం ఒకరితో ఒకరు కలుసుకోలేదు. ఈ కేసుద్వారా ఎంతో ఆత్మీయులమయ్యాం చూడండి" అన్నాడు సాగర్.

"ఒక్కోసారి ఇలాగే స్నేహాలు అనుకోకుండా ఏర్పడుతుంటాయి" అన్నాడు అనిల్.

"ఈ సందర్భంగా రేపు సాయంత్రం హోటల్ అశోకాలో డిన్నర్ చేద్దాం. యువిల్‌బి మై గెస్ట్" అన్నాడు సాగర్.

"అలాగే. ఆప్యాయంగా ఆహ్వానిస్తే కాదంటానా? రేపు సాయంత్రం ఆరు గంటలకి డైరెక్టుగా అక్కడికే వస్తాను?" అన్నాడు అనిల్.

"నో...నో...నేనేవచ్చి మిమ్మల్ని పికప్ చేస్తాను. మీ అడ్రస్ ఇయ్యండి" అని తన విజిటింగ్ కార్డ్ ఇస్తూ "ఇదే నా ఇల్లు, లేబొరేటరీ రెండూనూ" అన్నాడు.

అది చూసి "అరే. మీకూ మా ఇంటికి పెద్ద దూరం లేదు" అంటూ తన విజిటింగ్ కార్డ్ కూడా ఇచ్చాడు సాగర్.

అప్పటికి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు అనిల్.

మర్నాడు సాయంత్రం ఆరు గంటలకే తన కారులో అనిల్ ఇంటికి వచ్చాడు సాగర్.

ఆయన వచ్చిన విషయం సెక్రటరీ ద్వారా తెలుసుకుని మేడపైనుంచి క్రిందికి దిగివచ్చాడు అనిల్.

"వెల్‌కం టు యు మిస్టర్ సాగర్. దిసీజ్ ప్రభ మై సెక్రటరీ, అసిస్టెంట్ ఎట్ సెట్రా ఎట్ సెట్రా" అంటూ తన సెక్రటరీని పరిచయం చేశాడు.

"హౌడుయుడు" అంటూచిరునవ్వుతో బదులిచ్చింది ప్రభ.

"ప్రభా. మేం పైకి వెళ్ళి లేబరేటరీలో మాట్లాడుతుంటాం. ఒక గంట తర్వాత హోటల్ అశోకాలో మా లంచ్ ఉంది. ఇఫ్ యు వాంట్ యు కెన్ గో" అన్నాడు అనిల్.

"కొంచెం సేపుండి రేపటి ప్రోగ్రాం అంతా ఫిక్స్ చేసుకుని వెళ్తాను" అంది ప్రభ.

"దట్స్ ఫైన్. పైకి వెళ్దాం. రండి మిస్టర్ సాగర్" అంటూ మెట్లవైపు దారి తీశాడు అనిల్.

ఇద్దరూ కూర్చున్నాక "మిస్టర్ అనిల్ యు డిడ్ ఎస్ప్లెండిడ్ జాబ్. అసలు మీరు కోర్టుకు ఎందుకు వచ్చారు? మీరే కనక ఆ సాక్ష్యం లాగకపోతే ఆ రోగ్ స్కాట్ ఫ్రీగా ఎస్కేప్ అయ్యుండేవాడు" అన్నాడు సాగర్.

"చూడండి. అబ్దుల్లా పచ్చినెత్తురు తాగే గూండా.వాడికి రాజకీయ నాయకుల, పోలీసుల అండ ఉంది. అందుకే వాడి నీడను తాకడానికి కూడా అందరూ భయపడుతారు. అటువంటిది రంగనాథ్ వంటి ఒక నిజాయితీ పోలీసు ఆఫీసర్‌ని వాడు నడిరోడ్డుమీద దారుణంగా హత్యచేస్తే ఆ విషయం సాక్ష్యం చెప్పడానికి ఎవరూ ముందుకు రాలేదు. రంగనాథ్ నిజాయితీకి ప్రతిఫలం-ప్రాణాలు పోవడం. నిజాయితీగా చాలీచాలని జీతంతో బ్రతికే ఆయన కుటుంబం వీధిన్న పడడం ఇది చూసేసరికి నా కడుపు రగిలిపోయింది. సంచలనం కలిగించిన ఈ కేసు వివరాలు ఎప్పటికప్పుడు ఆసక్తితో చదువుతూ వచ్చాను. ఎప్పుడైతే హంతకుడని అందరికీ తెలిసిన అబ్దుల్లా నిర్దోషిగా బయటపడబోతున్నాడో ఇంక తట్టుకోలేకపోయాను. నా యంత్రంతో నిజాన్ని బయటపెట్టాలనుకున్నాను. ఆ తర్వాత సంగతి మీకు తెలిసిందే" అన్నాడు అనిల్.

"ఊ చాలా బాగుంది. ఇంతకీ మీ యంత్రం అతని ఆలోచనలను ఎలా బయటపెట్టింది? సీక్రెట్ కాకపోతే చెప్పడండి" అన్నాడు సాగర్.

సీక్రెట్ ఏమీ లేదు. సైన్స్‌ని రహస్యంగా ఉంచడం సైంటిస్టుల సాంప్రదాయానికే విరుద్ధం. నేను కనుగొన్న దానిలో ప్రత్యేకించి విశేషం ఏమీ లేదు. మనిషి శరీరంలో జరిగే అనేక ప్రక్రియలు విద్యుత్ సంబంధమైనవేనని తెలిసిన విషయమే. నరాలు, నాడులు విద్యుత్ తరంగాలద్వారానే సంకేతాలను అందుకుని తమ విధులను నిర్వర్తిస్తాయి. అంతేకాదు మనిషి మెదడులో కలిగే ఆలోచనలు కూడా విద్యుత్తరంగాలను సృష్టిస్తాయి. వీటిని "బయో కరెంట్స్" అంటాం. అయితే ఇవి అమిత బలహీనంగా ఉండడంవల్ల మామూలు విద్యుత్ పరకరాలతో వీటిని గుర్తించడం సాధ్యంకాదు. మెదడులో అనేక గ్రంథులలో వివిధ ఎమినోయాసిడ్‌లు ఉంటాయి. జీవపదార్థం ఏర్పడడంలో వీటి పాత్ర ఎంతో ప్రధానంగా ఉంటుంది. విద్యుత్ తరంగాలను ప్రసారం చేయడంలో ఈ ఎమినోయాసిడ్స్ మంచి మీడియంగా వ్యవహరించగలవని నేను కనుగొన్నాను. నేను రూపొందించిన యంత్రంలో గ్లాస్‌కేస్‌లో మీరు చూసిన ఆకుపచ్చ ద్రవం ఈ విధమైన ఒక ఎమినో యాసిడే. దానిలో ఎలక్ట్రోడ్స్ ఉంచి వెండివైర్లతో మనిషి కణతలకు కనెక్ట్ చేస్తే ఎలక్ట్రిక్ సర్క్యూట్ కంప్లీట్ అవుతుంది. వెండిని ఎన్నుకోడానికి కారణం వెండి చాలా మంచి విద్యుత్ వాహకం కావడం. దీనిలో రెసిస్టెన్స్ చాలా తక్కువగా ఉంటుంది. నేను రూపొందించిన యంత్రం మస్తిష్కంలోని విద్యుత్ తరంగాలను శక్తిమంతం చేస్తుంది టెలిఫోన్‌లో మాటలు విద్యుత్‌గా మారి, తిరిగి ఆ విద్యుత్ మాటలుగా మారినట్లే నేను రూపొందించిన యంత్రం మస్తిష్కంలోని తరంగాలను శక్తిమంతం చేయడమేకాకుండా, ఆ ఆలోచనలు సృష్టించిన విద్యుత్ తరంగాలను మాటలుగా మార్చి టేప్‌మీద రికార్డు చేయగలదు" అని వివరించాడు అనిల్.

"అద్భుతంగా ఉంది. ఈ లెక్కన ఈ యంత్రంలో ఎవరి ఆలోచనలనైనా బయటపెట్టించి న్యాయం జరిపించవచ్చునన్నమాట"

"ఆ మాట నిజమమేకాని అందువల్ల అనర్థాలు కూడా ఉన్నాయి"

"ఎలా?"

"ఒక ఐరావతంలాంటి సుందరి తన అందం గురించి చెప్పమని భర్తని వేధిస్తోందనుకుందాం. మామూలుగా అయితే ఆయన ఆమె మనసు నొప్పించకుండా ఉండడానికి "ఆహా నీవు రంభవి. ఓహో...ఊర్వశి నీముందు దిగదుడుపు" అంటాడు. ఆవిడకి అనుమానం వచ్చి ఈ యంత్రాన్ని ఆ మానవుడిమీద ప్రయోగించిందనుకోండి. వెంటనే "ఈ గున్న ఏనుగు జలగలా నన్ను పీడిస్తోంది ఏమిట్రా' అని అనుకున్నాడో సహజంగా ఈ మాటలనే యంత్రం రికార్డు చేస్తుంది. ఇంకేముంది? కొంపలు అంటుకుపోతాయి. అప్పడాల కర్ర తీసుకుఒని ఆవిడ ఆ నిర్భాగ్యుని వెంట పడుతుంది.

"నిజం అత్యధిక సందర్భాలలో చేదుగా ఉంటుంది.ఎవరికీ నష్టం లేనప్పుడు అందమైన అబద్దాలు ఆడడం నిజ జీవితంలో తప్పనిసరి. అటువంటప్పుడు మనసులోని నిజాలు మర్మంలేకుండా బయట పడ్తుంటే మనుగడ సాగించడం అసాధ్యం అవుతుంది. అందువల్ల ఈ యంత్రాన్ని అత్యవసర సమయాల్లో, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వాడడం మంచిది అని నా అభిప్రాయం" అన్నాడు అనిల్.

"నిజం. మీరు ఎంతో దూరం, ఎంతో లోతుగా ఆలోచించారు. నాకు అంత దూరం ఆనలేదు" అన్నాడు సాగర్.

"శాస్త్రజ్ఞుడిగా అది నా బాధ్యత. ఒక పరిశోధన జరిపినప్పుడు దాని పూర్వాపరాలూ, మంచి చెడ్డలూ, అది తీసుకురాగలిగే ఫలితాలు అన్నీ ఆలోచించాలి. ఎందుకంటే విజ్ఞానం రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. దానిని ఎంతో జాగ్రత్తగా ప్రమాదానికి ఆస్కారం లేకుండా ఉపయోగించాలి"

"ఒకే. ఇంక మనం బయలుదేరుదాం. కబుర్లతో కడుపు నింపేసుకుంటే అక్కడేం తింటాం" అంటూ లేచాడు సాగర్.

"యస్ పోదాం..." అంటూ తానూ లేచాడు అనిల్.

మర్నాడు సాయంత్రం ఆరున్నర అయింది. చలికాలం ముదరడంతో బాగా చీకటి పడింది.

ప్రభ కంగారుగా ఫోన్ చేసింది సాగర్‌కి.

"సార్. నేను అనిల్‌గారి సెక్రటరీ ప్రభను మాట్లాడుతున్నాను"

"ఏమిటి సంగతి?"

"సార్ డాక్టర్ అనిల్ రూంలోపల గడియపెట్టి ఉంది. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఎంత పిలిచినా పలకడం లేదు. ఇంటర్‌కంలో పిలిచినా రెస్పాన్స్ లేదు నాకు ఎందుకో భయంగా ఉంది."

"ఇంతసేపు నువ్వక్కడ లేవా?"

"ఉన్నాను సార్. ఐదింటికి ఆయన నన్ను పిలిచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి ఏవో కొన్ని బుక్స్ , రికార్డ్సు తెమ్మన్నారు. వాటిని తెచ్చి వచ్చేసరికి ఇదీ పరిస్థితి"

"ఇంట్లో ఇంకెవరూ లేరా?"

"ఇంకెవరుంటారు సార్. ఆయన బ్రహ్మచారి కదా!"

"ఓ. అలాగా ఈ విషయం పోలీసులకు కాని, ఇంకెవరికి కాని ఫోన్ చేశావా?"

"లేదు సార్. ఏం చేయాలో తోచక మీకే చేస్తున్నాను"

"సరే. ఇప్పుడే వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాడు సాగర్.

మరో పది నిమిషాలలో అనిల్ ఇంటిని చేరుకున్నాడు సాగర్. కారు శబ్దం విని ప్రభ ఎదురువచ్చింది.

ఆమెని చూస్తూనే "ఏమైనా తెలిసిందా?" అన్నాడు సాగర్.

"లేదు సార్. మళ్ళీ మళ్ళీ పిలిచాను. అయినా జవాబు లేదు."

అనిల్ లేబొరేటరీకి వున్న వెంటిలేటర్లు ప్రక్కలకు ఉన్నాయి.

అంటే ముందు వీధివైపు, వెనక పెరడువైపు ఉన్నాయి.

విండో రూఫింగ్ పైకి ఎక్కి వెనక వెంటిలేటర్‌లోంచి చూశాడు సాగర్. లోపల ఎవరూ లేరు.ఫాన్ తిరుగుతూనే ఉంది. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. బల్లలు, కుర్చీలు చిందరవందరగా ఉన్నాయి. బల్లమీద పుస్తకాలు క్రిందడివున్నాయి. అక్కడ పెనుగులాట ఏదో జరిగినట్లుగా స్పష్టంగా తెలుస్తోంది.

వెంటనే లోపలకి తిరిగివచ్చి బలంగా తలుపును కాలితో తన్నాడు సాగర్. రెండు మూడు తన్నులకు బోల్టు ఊడి తలుపు తెరుచుకుంది.

ఒక్క ఉదుటున సాగర్, ప్రభ లోనికి ప్రవేశించారు. బాత్‌రూంకి ఆనుకుని వున్న మెట్లగది తలుపు తెరిచిఉంది. దానిద్వారా పెరట్లోకి దిగారు.

"ఎవరో గాంగ్ వచ్చి డాక్టర్ అనిల్‌ని కిడ్నాప్ చేసి ఇటునుంచి తీసుకుపోయారన్నమాట. ఈ పెరటి వెనకాల ఖాళీస్థలమే కాని ఇళ్ళేమీ లేకపోవడంతో ఇట్నుంచి తేలిగ్గా ఆయన్ని ఎత్తుకుపోయారు"

"ఎవరు చేసి ఉంటారు ఈ పని?"

"ఇంకెవరు... అబ్దుల్లా గాంగే. వాళ్ళు ఈ విధంగా పగ తీర్చుకుంటారని అనుమానించకపోవడం నా బుద్ధి పొరపాటు" అంటూ నొచ్చుకోసాగాడు సాగర్.

"ఇప్పుడేమిటి చేయడం?"

"ముందు పోలీసులకి ఫోన్ చేయాలి. వారు ఇక్కడికి రాగానే వారితో ఆలోచించి తర్వాత సంగతి చూడాలి" అంటూ ఫోన్ దగ్గరికి వెళ్ళాడు సాగర్.

ప్రభ ఈలోగా లేబరేటరీలోకి వెళ్ళింది.

ఫోన్ చేశాక తానూ లేబొరేటరీలోకి వచ్చాడు సాగర్.

ప్రభ ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ ప్రక్కన నిలబడి ఉంది. ఆ బల్లమీద ఒక చిన్న బీకర్‌లో ఆకుపచ్చ ద్రవం-ఆ యంత్రంలోని గ్లాస్‌కేస్‌లో ఉన్నటువంటిదే ఉంది. ఆమె ఆ బీకర్‌ని తీసుకొని ఆ ద్రవాన్ని గడగడా త్రాగసాగింది.

ప్రభ చేస్తున్న పనేమిటి? ఆమె అనిల్‌ని ప్రేమించి అతనికేదో అయిందన్న భయంతో ఆత్మహత్య చేసుకోవడం లేదుకదా?

కంగారుగా ముందుకు దూకుతూ "ప్రభా! ఏమిటి నువ్వు చేస్తున్న పని?" అంటూ దగ్గరకు వెళ్ళాడు సాగర్. అప్పటికే ఆ ద్రవాన్ని త్రాగడం పూర్తి చేసింది ప్రభ.

"ప్రభా. ఏమిటి నువ్వు చేసిన పని?" అంటూ భుజం కుదుపుతూ గద్దించి అడిగాడు సాగర్.

చూస్తుండగా ఆమె వళ్ళు జ్వరంతో పేలిపోతున్నట్లు వేడెక్కింది. కళ్ళూ ఒళ్ళూ ఎర్రబడిపోయాయి. శ్వాస వెచ్చగా వస్తోంది. మూర్ఛపోతున్నట్లుగా ఆమె వాలిపోయింది.

వెంటనే ఆమెని కుర్చీలో కూర్చోబెట్టి బల్లమీదున్న నీళ్ళ గ్లాస్ తీసుకొని ఆమె ముఖాన్ని నీటితో తుడవసాగాడు సాగర్.

అతి కష్టంమీద మాట్లాడుతూ "నా గురించి కంగారు పడకండి. ఈ ఎఫెక్ట్ కొంచెంసేపు ఉంటుంది. ముందు డాక్టర్ అనిల్‌ని వెతికే సంగతి చూడండి" అంది ప్రభ.

మరో పది నిమిషాలలో పోలీస్ జీప్ అక్కడికి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ అబ్రహాం మరి కొందరు కానిస్టేబుల్స్ అందులోకి వచ్చారు. కానిస్టేబుల్స్‌ని క్రిందనే ఉంచి తాను లోనికి వచ్చాడు అబ్రహాం.

ఆయనను మెట్లమీదే రిసీవ్ చేసుకుని వెంట తీసుకువెళ్ళి లేబరోటరీలోని పరిస్థితిని చూపించాడు సాగర్.

ఈలోగా ప్రభ తేరుకుంది.

"ఊ...ఇది అబ్దుల్లా గాంగ్ పనే. సందేహంలేదు. పదండి. మీరిద్దరూ కూడా మా వెంట రండి. ఉయ్ హావ్ టు ఛేజ్ ది కల్ ప్రిట్స్" అంటూ చక చకా మెట్లు దిగసాగాడు అబ్రహం.

ప్రభ త్వరత్వరగా ఇంటికి తాళం పెట్టింది.

అందరూ పోలీస్ జీప్ ఎక్కారు.

ముందుగా అబ్రహం వైర్‌లెస్ సెట్ తీసుకుని అన్ని పోలీసు స్టేషన్లకూ మెసేజ్ ఇయ్యవలసిందిగా కంట్రోల్ రూంకి చెప్పాడు. నగరంనుంచి వెళ్ళే అన్ని దారులదగ్గరా కాపలా వుంచి ప్రతి వాహనాన్ని చెక్ చేయమని ఆ మెసేజ్ సారాంశం.

జీప్ తుఫాన్ మెయిల్‌లాగా దూసుకుపోతుంది.

విజయవాడ రోడ్ మీద హయాత్‌నగర్ దాటి జీప్ పోతోంది.

వెనకాలనుంచి అమిత వేగంతో ఒక అంబాసిడర్ కారు పోలీసు జీప్‌ను రాసుకుంటూ వెళ్ళిపోయింది. ఆ కారులోపల లైట్లు లేవు. క్షణంలో చూసిన ఆ చూపులోనే కారులో నలుగురు బలిష్టులు - వారి మధ్యకాళ్ళూ చేతులూ కట్టివేసి ఒక వ్యక్తి ఉన్నట్లు అనిపించింది సాగర్‌కి.

ఆ కారు తాకిడికి జీప్ ప్రక్కకి వెళ్ళి డ్రైవర్ ఆపడంతో కీచుమంటూ ఆగింది. దానిని మళ్ళీ రోడ్‌మీదకి త్రిప్పి నడిపేలోగా ముందు కారు కనింపించనంత దూరం వెళ్ళిపోయింది.

ఆ కారులో డాక్టర్ అనిల్‌ను గూండాలు కట్టి తీసుకుపోతున్నట్లు నాకు అనిపిస్తోంది" అన్నాడుసాగర్.

"సందేహం లేదు వాళ్ళు అబ్దుల్లా మనుష్యులే అయ్యుండాలి. మనల్ని గుర్తుపట్టి మన జీప్‌కి ప్రమాదం కల్పించడానికి ప్రయత్నించి ఉండవచ్చు" అన్నాడు అబ్రహం.

మరో పది నిమిషాలు ఆ అంబాసిడర్ వెళ్ళిన వైపే పోలీసు జీప్ వెళ్ళింది. కాని ఆ కారు జాడలేదు.

ఇంతలో ఉన్నట్లుండి ప్రభ శ్రద్ధగా ఏదో ఆలకిస్తున్నట్లుగా నిటారుగా కూర్చుని, అందర్నీ మౌనంగా ఉండమన్నట్లు సంజ్ఞ చేసింది.

"ఆ కారులో కట్టేసి ఉన్నది డాక్టర్ అనిలే. ఇప్పుడు ఆ కారు విజయవాడ రోడ్‌మీద పోతోంది. ఇప్పుడే చౌటుప్పల్ దాటింది. కారుని అటువైపు పోనీండి. ఇతర సెర్చి పార్టీలకు కూడా ఈ మెసేజ్ పంపండి" అంది ప్రభ.

అబ్రహం ఏదో అనబోయేసరికి "ముందు మెసేజ్ పంపండి?" అంది ఆర్డరిస్తున్నట్లుగా.

అబ్రహం వెంటనే మెసేజ్ పంపాడు.

ప్రభ మళ్ళీ అందుకుంది. ఆ కారు నెంబరు ఎ.పి.టి 5471. రంగు గచ్చకాయ రంగు. చౌటుప్పల్ దాటి నాలుగు కిలోమీటర్లు వెళ్ళింది" అంది.

మెసేజ్ మళ్ళీ సెర్చి పార్టీలకు వెళ్ళింది.

మరో ఇరవై నిమిషాలలో అన్నివైపులనుంచీ పోలీస్ కార్లు ఆ అంబాసిడర్‌ను చుట్టముట్టాయి. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయారు అబ్దుల్లా మనుష్యులు. వారు పోలీసులను ఎదిరించాలని విఫల ప్రయత్నం చేశారు. కాని ఫలితం లేకపోయింది. అంతా నిమిషాల మీద జరిగిపోయింది.

డాక్టర్ అనిల్ ఇంట్లో అందరూ సమావేశమయ్యారు.

"మిస్ ప్రభా...యు బికేమ్ ఎ వండర్‌ఫుల్ ప్రాబ్లమ్ ఫర్ అజ్. టెలిపతీ ద్వారా చెప్పినట్లు ఆ దొంగల ఆచూకిని ఎలా చెప్పగలిగావు?" అన్నాడు సాగర్.

"నేను చెప్పిందేముంది! డాక్టర్ అనిల్ తాను ఎక్కడున్నదీ చెప్పారు. నేను దానిని రిపీట్ చేసాను. అంతే" అంది ప్రభ నవ్వుతూ.

"వాట్!" అంటూ ఆశ్చర్యపోయాడు సాగర్.

"అవును సార్. టెలిపతీ ద్వారానే ఇదంతా జరిగింది. మనకి తెలిసిన టెలిపతీలో ఏ యంత్రాల సహాయమూ ఉండదు. కేవలం అమితశక్తిమంతమైన ఆలోచనా తరంగాలు అవతలి వ్యక్తి మస్తిష్కంలోకి ప్రవేశిస్తాయి. మా విషయంలో యంత్రం సహాయం ఉంది" అన్నాడు అనిల్.

అంటే మీరు మెసేజ్ ఇస్తారని ప్రభకి ముందే తెలుసునన్నమాట.

"ఇంకా మిమ్మల్ని సస్పెన్స్‌లో ఉంచడం అన్యాయం. వివరంగా చెప్తాను వినండి" అంటూ ప్రారంభించాడు అనిల్.

"ఇంతకు ముందు నా యంత్రం ద్వారా ఆలోచనలను మాటల రూపంలో రికార్డు చేయడం మీరు చూశారు. నా పరిశోధనలను కొనసాగిస్తుండగా నాకు మరో ఆలోచన వచ్చింది. విడిగా గ్లాస్‌కేస్‌లో అమినో యాసిడ్‌ను పోసి సర్క్యూట్‌కు కంప్లీట్ చేసే బదులు దానిని మనిషి శరీరంలోనే ఉంచి కంప్లీట్ చేయవచ్చుగా అని. అందుకుగాను ముందుగా నాపైనే ప్రయోగం చేసుకున్నాను. అబ్దుల్లా మనుష్యులు నాపై పగ తీర్చుకోడానికి ప్రయత్నిస్తారని ఊహించాను. దానికి సిద్ధపడి, వారు రావడం గమనించి బీకర్‌లో ఉన్న ద్రవం సగం త్రాగేశాను. అంతకుముందే ప్రభకు చెప్పి ఉంచాను. నాకేదైనా ప్రమాదం జరిగితే బీకర్‌లో ఉన్న మిగిలిన సగం ద్రవం తాగేయమని. అందువల్ల నా ఆలోచనలు తనకి అందుతాయని, తన ఆలోచనలు నాకు జేరుతాయనీ చెప్పాను. ఈ ద్రవం శరీరంలో ఉండడంవల్ల శరీరం ట్రాన్స్‌మీటర్‌గానూ, రిసీవర్‌గానూ కూడా పనిచేస్తుందన్నమాట. ఈ ద్రవంలో చేసిన మార్పులవల్ల విద్యుత్తరంగాలుగా మారిన ఆలోచనలను తగు మాత్రం శక్తిగల రేడియో తరంగాలుగా, వైర్లతో నిమిత్తం లేకుండా పంపడం సాధ్యం అయింది. ఎలక్ట్రోడ్స్ పెట్టి టేప్‌రికార్డ్‌నీ కలిపితే ఆలోచనలు మాటల రూపంలో రికార్డు అవుతాయి. అదిలేకుంటే ఒకరి ఆలోచనలు ఇంకొకరికి అర్థం అవుతాయి. ఒకరి మెసేజ్ ఇంకొకరు స్వీకరించగలరు. అయితే ఈ ద్రవాన్ని త్రాగిన వెంటనే విపరీతంగా అలసట వస్తుంది. రియాక్షన్ వచ్చి తీవ్రమైన జ్వరం వచ్చినట్లు అవుతుంది. కాని ఇది ఎంతో సేపు ఉండదు. ఈ వివరాలన్నీ ప్రభకు ముందే చెప్పాను. అబ్దుల్లా మనుషులు ప్రభలేని సమయంలో నా లేబొరేటరీలోకి దూసుకువచ్చి లోపల గడియపెట్టి నన్ను కట్టేశారు.

అప్పటికే కొంతసేపు పెనుగులాడాను. అయితే ద్రవం త్రాగడంవల్ల అలసటగావున్ననన్ను సులువుగా బంధించి తీసుకుపోయారు. మిగిలిన విషయం మీకు తెలిసిందే" అంటూ ముగించాడు అనిల్.

"అద్భుతంగా ఉంది. ఆ సమయంలో ప్రభ అక్కడ లేకపోవడమే మంచిదయింది. ఉండివుంటే ఆమెనీ బంధించేవారు. ఈ విషయం నాకు కాని, పోలీసులకు కాని తెలిసేది కాదు" అన్నాడు సాగర్.

"అవును ఆ మాట నిజం. సాయంత్రం ప్రమాదం జరగవచ్చునని ఊహించి కావాలనే నేను ప్రభను బయటకు పంపించాను" అన్నాడు అనిల్.

"మీ ముందు చూపు అద్భుతం. ఇంతటి ముందు చూపున్న మీరు మీ జీవిత భాగస్వామిని ఎందుకు ఎన్నుకోలేదు? అఫ్‌కోర్స్ దీసీజ్ యువర్ పర్సనల్ ఎఫేర్" అన్నాడు సాగర్.

"ఎన్నిక పూర్తి అయింది. మిస్ ప్రభ విల్ బి మై లైఫ్ పార్టనర్" అన్నాడు అనిల్ ప్రభ వంక ఓరగా చూస్తూ.

"ఓ. ఈజిట్. మై కంగ్రాట్స్ టు బోత్ ఆఫ్ యు" అన్నాడు సాగర్.

"కాని ఒక ఎమెండ్‌మెంట్" అంది ప్రభ.

ఇద్దరూ ప్రశ్నార్థకంగా చూశారు.

"ముందు మేము త్రాగిన ద్రవానికి విరుగుడు తీసుకోవాలి. ఒకరిమీద ఒకరికి ఎంత ప్రేమున్నా, కొంత కాలానికి ఆమోజు తగ్గి ఏదో సందర్భంలో ఒకరిమీద ఇంకొకరికి విసుగు, కోపం రావచ్చు. ఈ ద్రవం శరీరంలో వుంటే ఒకరి ఆలోచనలు ఇంకొకరికి ఎప్పుడూ తెలుస్తునే ఉంటాయి. అందువల్ల మంచికంటే చెడే ఎక్కువ జరుగుతుంది. మనసు మనం కావాలనుకున్నప్పుడు తెరుచుకోవాలేగాని, మిగిలిన సమయాల్లో మూసుకునే ఉండాలి"' అంది ప్రభ.

"వండర్‌ఫుల్ డాక్టర్ అనిల్ ప్రభకు మీకన్నా ముందుచూపు ఎక్కువ ఉంది" అన్నాడు సాగర్.

"మరి నా అసిస్టెంట్ అంటే ఏమనుకున్నారు! అందుకేగా అసిస్టెంట్ నుంచి లైఫ్ పార్టనర్‌గా ప్రమోట్ చేస్తోంది" అన్నాడు అనిల్ నవ్వుతూ.

"మరి దీనికి విరుగుడు ఉందా?" అన్నాడు సాగర్ అనుమానంగా.

"విరుగుడు కనుక్కోపోతే ఆ పరిశోధన పూర్తి కానట్లే లెక్క. విరుగుడు లేనప్పుడు దానిని ప్రయోగించడం కూడా జరగదు. దీనికి విరుగుడును ఎప్పుడో కనుగొన్నాను" అన్నాడు అనిల్.

"వెరీగుడ్. అయితే ఆలస్యం ఎందుకు ప్రభా... నీ చేత్తోనే ఆ విరుగుడిని నా సమక్షంలో అనిల్‌కిచ్చి నువ్వు కూడా పుచ్చుకో" అన్నాడు సాగర్.

'యస్. సర్" అంటూ లోనికి వెళ్ళింది ప్రభ.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, ఫిబ్రవరి 1990** ✪